# కన్యాకుమారి

"నాన్నగారికి సీరియస్‌గా వుంది. వెంటనే బయలుదేరి రావాలి" ఈ టెలిగ్రాము చూసుకుని. శ్యామల పెద్దపెట్టున నవ్వింది. ప్రక్కన కూర్చుని పనిచేస్తున్న సరళ వులిక్కిపడి, శ్యామలవంక చూసింది. కాని శ్యామల ముఖం అంతలోనే గంభీరమైంది. మనస్సు చీల్చుకుని ఒక నిట్టూర్పు వచ్చింది. టెలిగ్రాము మడిచి పెట్టెలో బట్టల అడుగున పెట్టేసింది. చీర మడతలోవున్న ఒక ఉత్తరం తీసి చదవటం మొదలుపెట్టింది. దృష్టి అంతా ఉత్తరంలో ఎర్ర సిరాతో రాసిన రెండు వాక్యాలమీద నిలచింది.

"కొందరిని అంతకాలం, అందరిని కొంతకాలం మోసంచెయ్యగలం. కాని అందరిని అంతకాలం మోసం చెయ్యలేము. మోసం చేద్దామని అనుకోవటం అవివేకం! నన్ను క్షమించమని అడగటం పొరబాటు. నిన్ను క్షమించగల స్తోమత, అర్హత నాకు లేవు.'

సంతకంగాని, పైన సంబోధనగాని లేని ఉత్తరం అది. అమెరికాలో మారుమూలరాష్ట్రంలో ఒక కుగ్రామం తపాల ముద్ర మాత్రం చెరిగీ చెరగకుండా వుంది.

ప్రక్క యింటి రేడియో గందరగోళంగా కనులు కనులతో కలబడితే ఆ కలలకు ఫలమేమీ?" అని ప్రశ్నిస్తోంది.

ఫలమా?

ఎండిపోయి నేల రాలిపోవటమే.

"మేడమ్" అని ఒక పసిపాప కంఠం బెదురు బెదురుగా పలికింది.

శ్యామల కన్నెత్తి అటుచూసింది. చిన్నపిల్ల వెంటనే నమస్కారం చేసింది, ప్రతి నమస్కారం చేసేలోపలే తనలో తాను అనుకున్నట్టుగా శ్యామల

"రాధ!" అని అనుకుంటూ నీపేరేమిటి పాపా?" అని అడిగింది.

"రాధ!" అని ఆ పిల్ల పలికింది.

"ఇల్లారా!" అని పిలిచింది.

ఆ పిల్ల దగ్గరకువచ్చి శ్యామలకు ఒక ఉత్తరం యిచ్చింది.

శ్యామలా!

ఇరవై మూడు సంవత్సరాల తరువాత నా దగ్గరనుంచి నీకు ఉత్తరం వచ్చిందంటే ఆశ్చర్యం కలిగించవచ్చు. నేను రాధని, జనార్థన్ను నీకు పరిచయం చేసిన మనిషిని అంటే చప్పున జ్ఞాపకం వస్తావనుకుంటా, ఈ పిల్ల మా మనుమరాలు. మా శ్యామల పెద్దకూతురు. శ్యామల అంటే మా పెద్దమ్మాయి, ప్రస్తుతం అది, దాని మొగుడు మీ వూళ్ళోనే వుంటున్నారు, రాధ మీస్కూల్లోనే చేరిందట. నువ్వు మీ ఆయన, మీ పిల్లలు ఎంతమందో నాకు తెలియదు. నువ్వెపుడూ రాయలేదుగా. కులాసాగా వున్నారని అనుకుంటాను. కోపం తగ్గినప్పుడు ఉత్తరాలు రాస్తూవుండు. ఉంటా.

నీ రాధ,

రాధ!

రాధకు మనుమరాలు ! ఎందరో

పుణ్యం కొద్ది పురుషులు దానం కొద్ది బిడ్డలు

పుణ్యం చేయని వాళ్ళు దానం చేతకాని వాళ్ళకి ఏం వాకాలి.

కూర్చో పాపా ! ఏ క్లాస్ చదువుతున్నావు.

సెకెండు ఫారం!

నీకు ఎన్ని ఏళ్ళు

పదకొండు

మీ అమ్మకు,

తెలియదండి,

సరే మంచిది వెళ్ళిరా !

ఆ పిల్లకు ఏం అర్థం కాలేదు. మాట్లాడకుండా వెళ్ళిపోయింది.

ఇరవై ఎనిమిది, పదిహేను ఎంత? అని శ్యామల అడిగింది. సరళ ఉలిక్కిపడి, ఏమిటి? అని అడిగింది.

ఏం లేదులే హిస్టరీదానివి నీకు లెక్కలేం వస్తాయి. అంటూ అక్కడనుంచి లేచి ప్రక్క గదిలోకి వెళ్ళి టెలిఫోను దగ్గర నిలబడి ఫోన్‌తీసి డయిల్ చేసేముందు ఒక్క క్షణం తటపటాయించింది. ముందుకు సాగిన చెయ్యి వెనక్కి తగ్గింది. కాని మరుక్షణంలోనే ఒక నిశ్చయానికి వచ్చింది. ఇరవై ఎనిమిది, పదిహేడు, రెండుఅని అనుకుంటూ ఏదో నెంబర్ ఫోన్ చేసింది.

అవతలి కంఠం హలో ! అని అన్నది.

“డాక్టరు శాంతాదేవి!” అని శ్యామల అడిగింది.

“ఎస్ స్పీకింగ్”

నేను శ్యామలని మాట్లాడుతున్నాను.

చెప్పండి.

మొన్న మీతో ఒక విషయం పొరపాటు చెప్పాను డాక్టరు.

ఏమిటది

నలభై కాదు. నా వయస్సు నలభై ఏడు.

అవతల కంఠం పలకలేదు.

లాభం లేదంటారా?

“లాభం సంగతికాదు. ఇటువంటి కేసు నేను ఎప్పుడూ చూడలేదు... “నేనేం చెప్పలేను.”

అల్లాగా... థాంక్యూ డాక్టర్ !

డాక్టర్ ఏం మాట్లాడలేదు...

“శ్యామలా !” అంటూ సరళ కంఠం పిలిచింది.

శ్యామల ఏం మాట్లాడకుండా ముందు వసారాలోకి వచ్చింది.

అరవైయ్యోవడిలో పడిన వ్యక్తి ఒకతను అక్కడ కూర్చున్నాడు. తనని చూడగానే. లేచి నిలబడి నమస్కారం చేశాడు.

శ్యామల ఏం మాట్లాడకుండా ఎదురుగుండా వున్న కుర్చీలో కూర్చుంది.

ఆయన ఏదో చెబుదామని అనుకున్నాడు కాని శ్యామల వాలకం చూసి మానుకున్నాడు.

శ్యామల అతనివంక చూసి చిరునవ్వు నవ్వింది. అతని మనస్సు రవ్వంత తేలిక అయింది.

"ఎవరినైనా మనిషిని వంటకి పెట్టుకొండి." అని అన్నది.

కొరడా దెబ్బతిన్నట్టు ఉలిక్కిపడ్డాడు.

"నా ఉద్దేశ్యం మార్చుకున్నాను" అని శ్యామల అన్నది.

"నా వల్ల పొరబాటు..." అంటూ అతనేదో చెప్పబోతున్నాడు.

నా వల్లనే జరిగివుండేది

ఎందుకని !

ఎండిపోయిన చెట్లకు కూడా కాయలు కాస్తాయని అనుకోవడం పొరబాటు కాదు!

శ్యామలా!

శ్యామల ఏం మాట్లాడకుండా లోపలికి వెళ్ళిపోయింది.

సరళ చిరునవ్వుగా శ్యామలవంక చూసి,

"కథ ఎంతవరకూ వచ్చింది?" అని అడిగింది.

శ్యామల ఏం మాట్లాడలేదు. విసురుగా వెళ్ళి తనగదిలో తలుపువేసుకొని పడుకుంది.

"జనార్ధన్‌తో నీకు పరిచయం చేసిర రాధను నేనే,"

ఇదేవాక్యం మనస్సులో ఒకటికి పదిసార్లు మారు మ్రోగింది.

జ నా ర్ధ న్ ! ! !

మిమ్మల్ని చూడగానే మన మెపుడో ఎక్కడో యింతకుముందే కలుసుకున్నట్టు అనిపిస్తోంది.

సినిమాలో హీరో హీరోయిన్ని కలుసుకొనేటపుడు ముందుగా అనే మాటలు.

యుగ యుగాలనుంచి ఒకరినొకరు ఎరుగున్నాం! ! !

జనార్ధన్ తనతో ఈ మాటలు అనలేదుకాని అతను అన్నమాటలకు అర్థం యిదే.

మొట్టమొదటిసారి అంటే ఎన్ని సంవత్సరాలో ఈనాడు చెప్పలేం, మంగళగిరి ఆలయంలో తను జనార్ధన్‌న్ని చూసింది.

స్కూల్లో టీచరుగా చేరిన మొదటి సంవత్సరం అది. ఆ రోజున ఏదో పండుగ హెడ్ మిస్ట్రెస్ వాళ్ళ కుటుంబంతో తనూ ఆనాడు పిక్‌నిక్‌గా మంగళగిరి వచ్చింది.

వీళ్ళకంటే ముందరే అక్కడ ఒక కారు వచ్చి ఆగింది. హెడ్‌మిస్ట్రెస్‌ని చూడగానే వాళ్ళంతా ఆవిడని పలుకరించారు. నలుగురు ఆడవాళ్ళు ముగ్గురు మగవాళ్ళు.

జనార్ధన్‌న్ని చూపించి డాక్టర్ జనార్ధన్ ఎమ్.ఎ.పిహెచ్.డి. అని పరిచయం చేశారు.

ఈ అమ్మాయి మా శ్యామల ఎమ్.ఎ. ఫస్ట్ క్లాసు అని తనని పరిచయం చేశారు.

గుడిలో పూజ ప్రారంభమైంది. ఏ జంట కాజంటగా నిలబడి వున్నారు.

తనూ జనార్ధన్ మాత్రం జంటలేక ఒంటరిగా నిలబడ్డారు.

అమ్మా మీరు యిటురండి అని పురోహితుడు శ్యామలతో అనగానే శ్యామల జనార్ధన్ ప్రక్కకొచ్చి నిలబడింది.

పూజ జరుగుతున్నంతసేపూ శ్యామల మనస్సు ఏదో సంకోచంతో బాధపడుతూనేవుంది.

"జనార్ధన్ శర్మణః ధర్మపత్ని సమేతయా" అంటూ పురోహితుడు తమ యిద్దరికి శఠగోపం పెట్టి, కుంకం వున్న పళ్ళెం తన ముందు వుంచాడు.

నేను వారి ధర్మపత్నిని కాదు, అని తను చెప్పలేకపోయింది.

పూజ పూర్తిచేసుకుని అంతా బయటకు వచ్చారు.

ఏ జంటకాజంట ముందుకు సాగిపోయారు, తాము యిద్దరూ మాత్రం మిగిలారు.

"అతనికి తెలియదు" అని జనార్ధన్ అన్నాడు.

శ్యామల ఏం మాట్లాడలేదు, కన్నీరు అతనికి కనిపించకూడదని ముఖం ప్రక్కకు తిప్పుకుంది.

"ఐం యాం సారీ!" అని అతను అన్నాడు.

" ప్లీజ్ గో ఎవే!" అని శ్యామల అన్నది.

అతను నిజంగా వెళ్ళిపోతే ఎంత బాగుండేది!! కాని అల్లా జరగలేదు.

వారం రోజుల తరువాత తమ స్కూల్ దగ్గర కనిపించాడు. అతన్ని చూడగానే తనకు నిలువెల్లా ముంచివేసే ఆనందం, సిగ్గు కలిగాయి. అతను దగ్గరగా వచ్చాడు. మల్లెపువ్వులాంటి బట్టలలో అతను ఎంత అందంగా వున్నాడు!!

తనను పలుకరించకుండా వెళ్ళిపోతే! మనస్సులోనే వెయ్యి దేముళ్ళకు మ్రొక్కుకుంది.

"నమస్తే!" అని వినిపించింది.

శ్యామలకు అడుగు ముందుకు సాగలేదు. నోట మాట కూడ రాలేదు.

మరిచిపోయారా?

"లేదు" అన్నట్టు శ్యామల తలవూపింది.

శ్యామల దగ్గరకు ఎవరోవచ్చి నిలబడ్డారు. ఆవిడని చూడగానే జనార్ధన్ నమస్కారమండి అని అన్నాడు.

శ్యామల ఉలిక్కిపడి అటుచూసింది. హెడ్ మిస్ట్రెస్ నిలబడి వుంది.

లోపలకు రండి అని అతన్ని ఆవిడ ఆహ్వానించింది.

శ్యామలకూడా వెంట వచ్చింది.

నాకు ఈ ఊళ్ళో వుద్యోగం వచ్చిందండి కాలేజీలో, ఇల్లుకూడా దొరికింది - 9 రామ స్వామి స్ట్రీటు.

శ్యామలకు ముచ్చెమటలు పోశాయి, తను కూడా 9 రామస్వామి స్ట్రీటులోనే అద్దెకు ఉంటోంది.

ఇహ అక్కడ ఆగలేదు. తొందర తొందరగా క్లాసుకు వెళ్ళిపోయింది.

క్లాసులో కూర్చున్నదన్న మాటేగాని పాఠాలు ఎల్లా చెప్పిందో ఏమో తనకు

తెలియదు.

సాయంకాలం ఇంటికి చేరేసరికి అతను మేడమీద వసారాలో నిలబడి వున్నాడు.

శ్యామలను చూడగానే క్రిందకు దిగివచ్చి

"నమస్తే ! రండి ! అని అన్నాడు.

"నేనుకూడా ఈ యింట్లోనే అద్దెకు వుంటున్నాను" అని శ్యామల అన్నది.

అతని ముఖంలో రవ్వంత నిరాశ కనిపించింది.

ఐ సీ ! అని అన్నాడు.

శ్యామల తన పోర్షనులోనికి వెళ్ళిపోయింది. ప్రక్క పోర్షనులోవున్న ముసలి అయ్యంగారు మనుమరాలికి వీణ నేర్పుతున్నారు.

శ్యామలని చూడగానే రా తల్లీ! అని అన్నారు.

తాతగారిని చూస్తే శ్యామలకు అంతులేని ఆనందం !

"ఇవ్వాళ ఏం వాయించమంటావు!" అని శ్యామలను అడిగారు.

"నిధి చాల సుఖమా" అని శ్యామల అన్నది.

తాతగారు పెద్దపెట్టున నవ్వారు. ఆ నవ్వు వింటూవుంటే సెలయేటి గలగల జ్ఞప్తికి వస్తుంది.

"నవ్వుతున్నారు దేనికి?" అని శ్యామల అడిగింది.

నీ వయస్సులో వున్నప్పుడు నేను "ఓర చూపుచూచేది న్యాయమా" అన్నపాట

వీళ్ళ మామ్మని వాయించమని రోజూ అడుగుతూ వుండేవాడిని,

తన వయస్సు ఎంతో తాగారికేం తెలుసు?

తను ఇంటర్‌మీడియెట్ చదువుతూండగా తన క్లాసుమేటు శకుంతల తనకంటే దాదాపు పది సంవత్సరాలు పెద్దది. ఇద్దరు పిల్లల తల్లి, కాని చూడటానికి శ్యామలకంటె చాలా చిన్నదానిలాగా కనిపించేది. ఒక రోజు వుండబట్టలేక తనే అడిగింది.

శకుంతల చిరునవ్వు నవ్వి

"నరాణాం గమనం జరా !

ఆగమనం జరా స్త్రీణాం!"

సిగ్గుతో తనముఖం కెంపు వన్నెకొచ్చింది.

శకుంతల బుగ్గమీద చిటికవేసి అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

"ఆగమనం జరా స్త్రీణాం!"

తాతగారు వీణతీసుకుని" నిధి చాలా సుఖమా!" అన్న కృతి ప్రారంభించేశారు.

శ్యామల తనగదిలోకి వెళ్ళి కూర్చుంది.

మేడమీద జనార్దన్ గదిలోంచి రేడియో మ్రోగుతోంది.

జనార్దన శర్మణః ధరపత్నీ సమేతః, యీ వాక్యం ఒక్కసారి మనస్సులో మార్మోగింది.

ధర్మపత్నీ !!!

తనకు ఆ రోజుబాగా గుర్తు, జీవితంలో ఏదో మధురమైన స్వప్నం ఆరోజునే ప్రారంభమైంది.

పదహారు వసంతాలు కాబోలు ఆనాటి తన వయస్సు, ఆరోజున తలంటిపోసుకుని జుట్టు విరబోసుకుని అద్దంముందు కూచున్నది, మెజంతా కంచి పట్టుచీరె తన వంటి రంగులో కలిసిపోయింది.

అద్దంలో తన ప్రతిబింబం అంతకంతకు మరీ అందంగా కనిపిస్తోంది.

"శ్యామా!" అంటూ చంద్రం బావ కంఠం వినిపించింది.

ప్రతి ఏడూ సెలవలకు వచ్చేబావే.. ఈనాడు చూస్తూవుంటే ఏదో క్రొత్తసిగ్గు ఏదో అర్ధంకాని హాయి తనమనస్సుని ఆవరించింది.!!

ఎప్పుడు వచ్చావు బావా! అని తను అడిగేలోపలే చంద్రం బావ తనని గట్టిగా కౌగలించుకుని ముద్దుపెట్టుకున్నాడు. తనకు అంతులేని భయం వేసింది.

విదిలించుకుని అక్కడనుంచి పారిపోయింది.

బావ మర్నాడు ఉదయం తన వూరినుంచి వెళ్ళిపోయాడు.

నెలరోజు అనంతరం చంద్రం బావ పెళ్ళి శుభలేఖ వచ్చింది.

ఆ రోజల్లా నాన్న తనతో మాట్లాడలేదు. రాత్రి ఎవరూ చూడకుండా దిండులో ముఖం పెట్టుకుని ఏడ్చి ఏడ్చి నిద్రపోయింది.

చంద్రం బావ పెళ్ళికి తమ యింట్లోంచి ఎవ్వరూ వెళ్ళలేదు.

ఇంట్లో వున్నది నాన్నా తనూ, ఇద్దరేగా అమ్మ తన పసితనంలో కన్నుమూసింది.

నాన్నే తనని పెంచాడు ! ! !

అన్ని విషయాలలో ఆయన అందరిచేత ఔననిపించుకున్నాడు.

కాని ఒక్కగానొక్క కుమార్తె పెళ్ళి విషయంలో మాత్రం ఆయన తెలివితేటలు ఎందుకనో పనిచెయ్యలేదు.

పెళ్ళివారు వచ్చేవారు. పిల్లని చూసేవారు. కాని ఎందువల్లనోకాని పిల్ల నచ్చినా జాతకాలు కుదరలేదనో, ఋషులు ఒకటయ్యారనో ఏదో శ్యామలకు అర్ధంకాని కారణంగా ఆ సంబంధం తప్పిపోయేది.

ఈ నిరంతర అన్వేషణ యిలాగే సాగిపోతోంది. నాన్నకు రిటైర్‌మెంటు రోజువచ్చింది. కాని శ్యామలకు మాత్రం సంబంధం కుదరలేదు.

నాన్నగారికి ఉద్యోగం లేదు. సంపాదనలేదు.

కాని కాలక్షేపం మాత్రం జరగాలి... జీవితంలో షష్టిపూర్తి దగ్గర పడుతూవుండగా వసంతం గుర్తుకువచ్చింది. ఆ గుర్తుతోబాటు శ్యామలకు ఒక మారుటితల్లి వచ్చింది.

సరస్వతి శ్యామలకంటె రెండు మూడునెలలు చిన్నది. ముగ్గురు అన్నలు, అయిదుగురు అక్కలు తరువాత కలిగిన ఆడబిడ్డ!

వాళ్ళ నాన్నకున్న సంపదల్లా సంతానమే.

సరస్వతిని ఒక్కదాన్నే రెండవ పెళ్ళివాడికి ఇచ్చాడు, మిగతా అందరిని మూడోపెళ్ళి, నాలుగో పెళ్ళివారికి ఇచ్చిచేశాడు.

అంతవరకూ ఆ పిల్ల అదృష్టవంతురాలే.

ఆ మనిషిని చూసిన మరుక్షణం శ్యామల ఒక నిర్ణయానికి వచ్చింది.

ఇహ తనబ్రతుకు తను బ్రతకాలి. మదరాసువచ్చి కాలేజీలో చేరింది. -

అందరి యిష్టానికి వ్యతిరేకంగా, చూస్తూవుండగానే బి.ఎ అయిపోయింది. ఎమ్.ఎ కూడా మంచి రాంకులో ప్యాసు అయింది.

ఆ సంతోష సమయంలో స్నేహితులతో కలిసి సినిమాకు వెళ్ళి యింటికి వచ్చింది.

నాన్న ఉత్తరం తనకోసం ఎదురుచూస్తోంది.

"ఇంట్లోవున్న నగలు, డబ్బు అన్నీ తీసుకుని పిన్ని యింట్లోంచి పారిపోయింది... నా చివరి రోజులు ఎల్లా గడుస్తాయో తెలియదు.

మొదటినెల జీతం తీసుకోగానే నాన్నకు నూరు రూపాయలు పంపుతూ, తనదగ్గర వచ్చి వుండవలసిందని ఉత్తరం రాసింది.

బ్రతికివున్నంతకాలం యిలా పోషించగలవా అని నాన్న దగ్గర నుంచి సమాధానం వచ్చింది.

తనే సమాధానం రాయలేదు కాని నెల నెలా డబ్బు పంపిస్తూనేవుంది. తన జీతం పెరిగినప్పుడల్లా ఆయనకు పంపే డబ్బుకూడా పెరుగుతూ వచ్చింది.

ఒక రోజున వూరినుంచి పిడుగులాంటివార్త వచ్చింది. నాన్న ఎవరో అమ్మాయిని వుంచుకున్నాడు.

శ్యామల నమ్మలేదు.

మళ్ళీ యింకొక వార్త వచ్చింది.

నాన్న డబ్బు పెట్టి పేక ఆడుతున్నాడు.

శ్యామలకు అనుమానం కలిగింది.

రెండు నెలలు గడిచాయి.

నాన్న త్రాగుతున్నాడు.

డబ్బు మామూలుగా పంపుతూ మీరుపెద్దవారైపోతున్నారు. మదరాసువచ్చి నా దగ్గర వుండవలసింది అని ఉత్తరం రాసింది.

నాన్న దగ్గరనుంచి విచిత్రమైన సమాధానం వచ్చింది.

నేను నీకు భారంగా తోస్తే చెప్పు గ్రుక్కెడు విషం త్రాగుతాను.

ఆ ఉత్తరాన్ని పెట్టె అడుగున భద్రంగా దాచి పెట్టింది.

ఆ రోజు సాయంకాలం ఏమీ తోచక పార్కుకి వెళ్ళింది.

రాధ కనిపించింది. వెంట వాళ్ళ ఆయన, ఆడపిల్లా వున్నారు. వాళ్ళను పలుకరించకుండా పారిపోయి వచ్చింది.

ఆనాటినుంచి నాన్న దగ్గరనుంచి తనకు వచ్చే వార్త అల్లా నెలనెలకి తను పంపించే మనిఆర్డరుకి వచ్చే తిరుగు రసీదు మాత్రమే.

ఎన్ని రోజులు. ఎన్ని నెలలు గడిచాయో చెప్పడం కష్టం.

ఒకనాడు ఒక పెళ్ళికొడుకు తనని చూడటానికి వచ్చాడు.

అతనిని చూసి తను నివ్వెరపోయింది.

అతను రెండవ పెళ్ళి సంబంధం! మొదట సంబంధం తాలూకు అయిదుగురు పిల్లలున్నారు. పెద్దపిల్ల వయస్సు పదహారు.

ఈసారి పెళ్ళిసంబంధం నచ్చకపోవటం శ్యామలవంతు.

ఆరోజు సాయంకాలం శ్యామలని చూడటానికి రాధ వచ్చింది. వెంట జనార్ధన్ కూడా వున్నాడు.

అతను వచ్చినందుకు ఆనందం కలిగిందోలేదో తెలియదుకాని శ్యామలకు కోపంలాంటిది వచ్చింది.

శ్యామలా ఇతను మాకజిన్ డాక్టరు జనార్ధన్. మీయింట్లోనే పైపోర్షనులో అద్దెకి వుంటున్నాడు. నీకు ఇంట్రొడ్యూస్ చేద్దామని తీసుకుని వచ్చాను.

శ్యామల లాంఛనంగా నమస్కారం చేసింది. కూర్చోమని కుర్చీ చూపింది.

రాధ ఒక అరగంటసేపు ఉన్నది. అందులో ఇరవై తొమ్మిది నిమిషాలు తన కూతురును గురించి తన శ్రీవారిని గురించి పొగడడంలోనే గడిచిపోయింది.

రాధ వెళ్ళగానే పెద్ద వాన వచ్చి వెలిసనంత నిశ్శబ్దంగా వుంది. ఈ నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ జనార్ధన్ కంఠం!

"సెలవు" అని అన్నాడు.

తను ఉలిక్కిపడి "కూర్చోండి" అంటూ లోపలికి వెళ్ళి ఒక గ్లాసులో వేడివేడి పాలు, పళ్ళెంలో రెండు చక్కెరకేళీ పండ్లు తీసికొని వచ్చి అతనిముందు పెట్టింది.

అతను శ్యామలవంక చూసి చిరునవ్వుతో ఫిఫ్టి ఫిఫ్టి అని అన్నాడు.

శ్యామల నిప్పులు చెరిగె కళ్ళతో అతనివంక చూసి అక్కడనుంచి వెళ్లిపోయి తాతగారి దగ్గర కూర్చుంది.

గంటన్నరకు తిరిగివచ్చింది. గ్లాసులోపాలు చల్లారిపోయి వున్నాయి, అరటిపళ్ళు అల్లాగే వున్నాయి.

పాలు తూములో పారపోసింది. పళ్ళు ముష్టిదానికి వేసింది.

సరిగ్గా నెలరోజుల అనంతరం మళ్ళీ జనార్ధన్ కనిపించాడు, ఈసారి ఆలయంలో కనిపించాడు.

ఈసారి తనే పలుకరించింది. "ఊళ్లో వున్నారా" అని.

'కోపం చల్లారిందనుకుంటాను!" అని ఎదురు ప్రశ్న వచ్చింది.

మీరు డాక్టరేటు ఏ సబ్జెక్టులో?

"రొమాన్సులో మాత్రం కాదు"

"అదొక్కటేకాదు, మర్యాదలోకూడా కాదని తెలుస్తోంది"

ఐ బెగ్ యువర్ పార్డన్

నెవర్ మైండ్ !!!

రెండునెలల అనంతరం హెడ్ మిస్ట్రెస్ ఒక రోజున తనతో,

"జనార్ధన్" గురించి నీ అభిప్రాయం ఏమిటి!

"గుడ్ ఫెలో" అని తను సమాధనం చెప్పింది.

"అతను నిన్ను వివాహం చేసుకుందామని అనుకుంటున్నాడు"

"మానాన్నగారున్నారు."

"అంటే నీకిష్టమేనన్నమాట" . నేను మీ నాన్నగారికి రాస్తాను.

శ్యామల మాట్లాడకుండా తన క్లాసుకు వెళ్ళిపోయింది.

రాధకు టెలిఫోను చేద్దామని అనుకొంది కాని అంతలోనే గుర్తుకు వచ్చింది. రాధవాళ్ళకు ట్రాన్సఫర్ అయి ఆ వూరినుంచి వెళ్ళిపోయారని.

రాత్రి ప్రొద్దుపోయేదాకా నిద్రపోలేకపోయింది, తెలతెలవారుతూండగా నాన్నకి ఉత్తరం రాసింది... "హెడ్ మిస్ట్రెస్‌గారు చెప్పిన సంబంధం వప్పుకోమని."

సమాధానంకోసం రెండుమాసాలు ఎదురుచూసింది.

శూన్యం.

ఒకరోజు సాయంకాలం ఇంటికివచ్చేసరికి తనకు కుడికన్ను అదిరింది.

ఇల్లంతా ఎటుచూసినా నిశ్శబ్దం!

జనార్దన్ పోర్షను తలుపులన్నీ తెరిచి వున్నాయి. మెల్లిగా మేడమెట్లిక్కి అతని గదిలోకి వెళ్ళింది.

అతని తాలూకు సామానులేవీ అక్కడలేవు.

నిశ్శబ్దం ! నిర్మానుష్యత్వం !

పున్నమి గడిచి అమావాస్య వచ్చింది. అమావాస్య అక్కడే ఆగిపోయింది.

రెండు నెలల అనంతరం ఇంగ్లీషు పేపరులో జనార్దన్, అతని భార్య ఫోటో కనిపించింది. ఉద్యోగంమీద అమెరికా వెడుతున్నాడని రాసివుంది.

హెడ్ మెస్ట్రెస్ తనతో ముభావంగా వుంటోంది. తాతగారు మదరాసువదలి వెళ్ళిపోయారు. మేడమీద పోర్షనులోకి మళయాళి వాళ్ళు అద్దెకువచ్చారు.

నాన్నదగ్గరనుంచి ఉత్తరం వచ్చింది.

"కులాసాగావున్నావా తల్లీ?" అని

"బ్రతికే ఉన్నాను" అని సమాధానం రాసింది.

తనకు ఉత్తరాలు ఎక్కడనుంచి రావు. ఉత్తరం వచ్చిందని ఒక రోజున వినగానే ఆశ్చర్యం పొందింది.

పరిచయంలేని దస్తూరి అది !

కవరులోపల రెండుకాగితాలు కనిపించాయి.

"శ్యామల గతచరిత్ర తెలిసేనువ్వు ఈ పెళ్ళికి ఒప్పుకున్నావా జనార్ధనం. కన్య అనగానే నమ్మివుంటావు. నీమీద ప్రేమకొద్దీ కాదు. తన కడుపులో పెరుగుతున్న పాపకు ఒక నీడ వుండటం కోసం.."

ఇహ తను చదవలేకపోయింది.

My god ! My god!అని బిగ్గరగా అరిచింది.

రెండవ ఉత్తరం మొదలుపెట్టింది. క్రింద జనార్థన్ అని ఎక్కడన్నా కనిపిస్తుందేమోనని ఉత్తరం ఒకటికి పదిసార్లు చదివింది !!

లేదు!

కొందరిని అంతకాలం. అందరినీ కొంతకాలం మోసం చెయ్యగలం. కాని అందరినీ అంతకాలం మోసం చెయ్యలేము, చేద్దామని అనుకోవటం అవివేకం. నన్ను క్షమించమని అడగటం పొరపాటు, నిన్ను క్షమించగల స్తోమత అర్హత నాలో లేవు.

...............................

శ్యామల మనస్సు, మంచుగడ్డకన్న రాయి అయింది. వజ్రంకన్నా కఠోరం అయింది.

"ఈ మగజాతిని నాశనం చెయ్యాలి!!

ఎలా? ఎలా? ఇదే మనస్సులో మార్మోగిన ప్రశ్న! సమాధానం శూన్యం!

వసంత మొచ్చింది!

వెళ్ళకుండానే హేమంతమొచ్చింది...

ఇతరుల జీవితాలలో నిత్యం ఎన్నో వసంతాలు వస్తూనే వున్నాయి.

కాని శ్యామల !!!

భయపడి ఒకరోజున లేడీడాక్టరు యింటికి పరుగెత్తుకుంటూ వెళ్ళింది.

డాక్టరు తనవంక చాలా జాలిగా చూసింది.

"ఎక్స్‌రే ట్రీట్‌మెంటు యిద్దాం. నెల నెలా ఈ న్యూసెన్సు వుండదు" అని అన్నది.

తనకు వళ్ళంతా ముచ్చెమటలు పోశాయి.

తనకు టైములేదు త్వరపడాలి.

ఇంటికి పరుగెత్తుకుంటూ వచ్చింది. అద్దం ఎదురుగుండా నిలబడింది.

ముఖం రెండుచేతుల్లో కప్పుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

స్కూల్స్ ఇన్‌స్పెక్టర్ రఘునాథరావు గుర్తుకు వచ్చాడు. తమ్ముల్ళు చదువులు, చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ కోసం తను పెళ్ళిచేసుకోకుండా ఇంతకాలం బ్రహ్మచారిగానే గడిపాడు. బాధ్యతలు అన్నీ ఈ నాటికి తీరాయి.

స్వంత బాధ్యతలు ఏర్పరచుకోవాలని ఈ నాటికి ఆలోచన కలిగింది.

ఆయన ప్రతి సంవత్సరం లాగానే ఈ సంత్సరంకూడా యిన్‌స్పెక్షన్‌కు వచ్చారు.

ఆ రోజున హెడ్ మిస్ట్రెస్ సమక్షంలోనే తనని అర్థించారు.

తనని వివాహం చేసుకోమని.

తన మంచుగుండె కరగలేదు.

సమాధానం యివ్వకుండా వూరుకుంది.

"ఆ రోజు రాత్రి రహస్యంగా లేడీడాక్టరుకు ఫోనుచేసింది నలభై సంవత్సరాల తరువాత స్త్రీకి సంతానం కలుగుతుందా?" అని డాక్టరుదగ్గర నుంచి సమాధానం - మౌనం !

"ఆడదానికి ముప్ఫై రెండు సంవత్సరాలలో సంతానం కలగకపోతే యిక కలగదు' ' అని ఏదోపత్రికలో తను చదివింది.

తనకు వయస్సు నలభై! కాదు నలభై అయిదు! కాదు నలభై ఏడు

నలభై ఏడు... యాభైకి మూడు తక్కువ యాభై ఏళ్ళ ముసలమ్మ!

ముసలమ్మ!

తను ముసలమ్మ!

శ్యామల ముసలమ్మ!

'టాక్సీ వచ్చింది అమ్మగారు" అని అటెండరు కంఠం వినిపించింది.

శ్యామల ఉలిక్కిపడ్డది.

"టాక్సీ దేనికి?" అని అడిగింది!

అతను ఆశ్చర్యంగా తనవంక చూశాడు. వూరు వెడదామని అన్నారుగా"

శ్యామలకు లీలగా గుర్తుకు వచ్చింది. పెట్టె అడుగున పెట్టిన ఉత్తరాలు, టెలిగ్రాము తీసుకుని బయలుదేరింది.

మర్నాడు అసుర సంధ్యవేళలో తను వూరు చేరింది.

ఇంట్లో ఎవ్వరూ లేరు. ఒక గదిలో నేలమీద నూనె దీపం పెట్టివుంది.

అంతా నిశ్శబ్దం.

తన తండ్రి యిహలేడు, తల్లి ఏనాడో లేదు.

తనకు ఎవ్వరూ లేరు, తనవాళ్ళు ఎవ్వరూ లేరు.

ఎవ్వరూ లేరు?

ఎవ్వరూ లేరు?

"శ్యామలా అంటూ ఒక కంఠం పలుకరించింది. ఆయన తనవూరి కరణంగారు.

నాన్న నీకు ఈ పెట్టె యిమ్మన్నాడమ్మా... అంటూ ఒక చిన్న పెట్టె యిచ్చాడు.

ఆ పెట్టెలో తనతల్లి మట్టెలు, మంగళసూత్రాలు వాటితోబాటు ఒక చిన్న కాగితం కనిపించింది.

కన్నీటితో తడిసిన కళ్ళతో ఆ ఉత్తరాన్ని విప్పింది. అందులో ఒకే ఒక వాక్యం వుంది.

ఆ ఉత్తరం రాసింది నేనే తల్లీ.

మీ నాన్న !

# పునర్జన్మ

"నువ్వు ఆరోగ్యం విషయం జాగ్రత్త వహించాలి. లేకపోతే ఈ జ్వరం దేంట్లోకి దింపుతుందో చెప్పలేం." అంటూ డాక్టరుగారు ఒక గట్టి హెచ్చరిక చేశారు.

జ్వరం ఇప్పటికే రెండోవారం ప్రవేశించింది. టైఫాయిడ్ కాదంటాడు డాక్టరు, ఏమిటేమిటో మందులిస్తున్నాడు. అన్ని మందుల కంపెనీల కొత్త కొత్త మందులన్నీ తనమీద వాడి చూశాడు. కాని ఫలితం శూన్యం !

కాని యిదేదో టైఫాయిడ్ కన్నా బలమైన విషజ్వరం, తన స్నేహితులలో ఇద్దరు టైఫాయిడ్ లాంటి జ్వరం వల్లనే, అది ఏనాడో డాక్టర్లు తేల్చుకునే లోపల పోయారు.

ఎంత బలంగా ఎంత హుషారుగా వుండేవాళ్లో ఎవరూ కూడా అనుకోలేదు.